సాక్షి
హనుమకొండ

గురువారం । 19 । జూన్ । 2025



చదువు'కొనే' వేళ.. - 8లో▸

పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఓ వైపు పెరిగిన స్కూల్ ఫీజులు, మరోవైపు విద్యార్థులకు కావాల్సిన నోట్ బుక్స్, స్టేషనరీ, మా కొనుగోలుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తుంది.



ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

విద్యుత్ కాంట్రాక్టర్ల నుంచి లంచం తీసుకుంటూ ఆ శాఖ మహబూబాబాద్ ఎస్‌ఈ నరేశ్ బుధవారం ఏసీబీకి చిక్కారు. - 8లో▸


గరిష్ఠం/కనిష్ఠం
34°/28°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

మద్యం మత్తు.. చలాన్ల చిత్తు

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం మత్తు అని గుర్తించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు ట్రై సిటీ(హనుమకొండ, కాజీపేట, వరంగల్) పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశారు. సాయంత్రం 6 గంటల దాటితే ప్రధాన రోడ్లపై పోలీసులు ఎటువైపు నుంచి వచ్చి పరీక్షలు చేస్తారో తెలియని పరిస్థితి. ట్రైసిటీలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జనవరి నుంచి మే వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 8,482 నమోదు కాగా 85,83,769 రూపాయల వరకు జరిమానాలు చెల్లించారు. దీనిని బట్టి మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఏ మేరకు కొరడా ఝుళిపిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. -వరంగల్ క్రైం



ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో..

నగరంలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్లతోపాటు వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లకు సమీపంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాదారులు అక్కడ అమ్ముడు ఎందుకు...?; ఇక్కడ పరీక్షలు ఎందుకు చేస్తున్నారు అని అసహనం వ్యక్తం చేసిన ఘటనలు ఉన్నాయి. మోతాదుకు మించి మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులకు మాత్రం జైలు జీవితం తప్పడం లేదు.

జరిమానాలు.. జైలు జీవితమే..


జనవరి నుంచి ఏప్రిల్ 30 వరకు హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ వాహనదారులకు రూ.28,96,960 జరిమానా విధించారు. ఇక కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.30,27,909, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.26,58,900 జరిమానా విధించారు. దీంతోపాటు అధికంగా మద్యం సేవించిన 260మంది జైలుకు వెళ్లారు.

మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి

మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని పోలీస్ అధికారులు తల్లిదండ్రులకు పదే పదే చెప్పిన ఎవరూ వినడం లేదు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్ సింగ్ మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు పోలీసులకు పట్టుబడిన మైనర్ డ్రైవింగ్ కేసుల్లో 91 మంది జైలుకు వెళ్లారు.

కోర్టు కానిస్టేబుళ్ల హవా..


సందట్లో సడేమియాలాగా.. డ్రంకెన్ డ్రైవ్ కేసులు కొంతమంది పోలీస్ అధికారులకు కాసుల వర్షం కురిస్తున్నాయి. మద్యం తాగి పోలీసులకు దొరికిన విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని అనుకునే వారు పోలీసుల డిమాండ్లకు తలొగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఇక కోర్టుకెళ్తే అక్కడి కోర్టు కానిస్టేబుళ్ల మరో దందాకు తెరలేపుతున్నారు. వాహనాల కాగితాలు లేవు.. రీడింగ్ ఎక్కువ వచ్చింది..అంటూ భయపెట్టి డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ట్రాఫిక్‌లో కోర్టు కానిస్టేబుళ్ల పోస్టుకు చాలా డిమాండ్ ఉండడంతో అదే పోస్టులో ఉండటానికి అధికారులు మారినప్పుడల్లా వారి ప్రయత్నాలు చాలా ఖరీదుగా ఉంటాయన్న ప్రచారం ఉంది.



మైనర్ డ్రైవింగ్ కేసులు ఇలా

పోలీస్ స్టేషన్	కేసులు	జైలు
హనుమకొండ	71	71
కాజీపేట	16	04
వరంగల్	19	16
మొత్తం	106	91

మొత్తం కేసులు



న్యూస్‌రీల్

మంత్రి పొంగులేటి, సీఎస్‌ను కలిసిన కలెక్టర్



హన్మకొండ అర్బన్: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీశ్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అలాగే, సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ కొనసాగింపు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్వీ రాజ్‌కుమార్‌ను మరో సంవత్సరం పాటు కొనసాగిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజ్‌కుమార్ పదవీకాలం ముగియడతో మళ్లీ ఆయననే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో రిజిస్ట్రార్ రామచంద్రంతో కలిసి రాజ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేశారు.

నేటి నుంచి యథావిధిగా పలు రైళ్లు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను ఇటీవల రద్దు చేయగా.. ఆ రైళ్లు గురువారం నుంచి యథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని బెల్లంపల్లి-రెచ్నీ రోడ్డులో చేపట్టిన రైల్వే బ్లాక్ కారణంగా పలు రైళ్లను కొన్ని రోజులు రద్దు చేశారు. ఈ నెల 19వ తేదీ నుంచి యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ (22534) వెళ్లే ఎక్స్‌ప్రెస్, పాట్నా-చర్లపల్లి (03253) వెళ్లే ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి-పాట్నా (07255) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లను యథావిధిగా నడుపనున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

టెట్ షురూ

విద్యారణ్యపురి: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ - 2025) బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇందుకోసం వరంగల్ నగరంలో ఒక పరీక్ష కేంద్రం, హనుమకొండలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. టెట్‌కు వివిధ సబ్జెక్టుల పరీక్షలు కంప్యూటర్ బేస్డ్‌లోనే నిర్వహించారు. తొలిరోజు ఉదయం 9 నుంచి 11-30 గంటల వరకు,మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఈనెల 19, 20, 23, 24, 27, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు కొనసాగుతాయి. మొత్తం 11,553 మంది అభ్యర్థులు టెట్ రాయనున్నారు.

నాడు అన్న నేడు తమ్ముడు

ఉద్యమంలో ముగిసిన గాజర్ల కుటుంబ ప్రస్థానం

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత రవి మృతి

- 33 ఏళ్ల క్రితం ఎర్రజెండా పట్టి అజ్ఞాతంలోకి..
- సెంట్రల్ కమిటీ సభ్యుడి హోదాలో మరణం
- వెలిశాలలో ముగిసిన అన్నల శకం

భూపాలపల్లి/టేకుమట్ల: వెలిశాల తల్లడిల్లింది. ఈ ప్రాంతంలో నక్సల్స్ ఉద్యమానికి పురుడు పోసిన గాజర్ల కుటుంబంలో మరొకరు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. 2008లో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ ఎన్‌కౌంటర్‌లో చనిపోగా, తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన తమ్ముడు రవి అలియాస్ గణేశ్ మృతిచెందాడు. దీంతో మావోయిస్టు ఉద్యమంలో గాజర్ల కుటుంబ ప్రస్థానం ముగిసినట్లయ్యింది. విషయం తెలియడంతో వెలిశాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉద్యమాల బిడ్డ-నిను మరువదు పోరు గడ్డ అంటూ పలువురు ఉద్యమకారులు రవి ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.

ఉద్యమానికి పురుడు పోసిన ఘటన..

వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల మల్లయ్య- కనకమ్మలకు ఐదుగురు కుమారులు రాజయ్య, సమ్మయ్య, సారయ్య, రవి, అశోక్. మల్లయ్య వ్యవసాయం, గౌడ కుల వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. 1987లో గుమ్మడవెల్లి కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో గాజర్ల సారయ్య చైర్మన్ బరిలో నిలిచి గెలుపొందాడు. అయినప్పటికీ అప్పటి పెత్తందారులు బ్యాలెట్ బాక్స్‌లను గల్లంతు చేసి ఓడినట్లుగా అధికారులతో ప్రకటింపజేశారు. దీంతో సారయ్య మందమర్రిలో ఉండే తన అన్న సమ్మయ్య దగ్గరికి వెళ్లి ఉపాధి కోసం చూస్తాడు. అక్కడ కూడా అతనిపై అక్రమ కేసులు మోపడంతో 1990లో పూర్తిస్థాయిలో నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లాడు. సారయ్య అలియాస్ ఆజాద్‌గా గుర్తింపు పొందాడు. అయన బాటలోకి గాజర్ల రవి, అశోక్ వెళ్లారు. 2008లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య అలియాస్ ఆజాద్ చనిపోయాడు. తాజాగా రవి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. అశోక్ మాత్రం 2016లో పోలీసుల ఎదుట లొంగిపోయి, ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

నేడు అంత్యక్రియలు...

ఎన్‌కౌంటర్‌లో రవి మృతి చెందాడని ఏపీ పోలీసులు బుధవారం మధ్యాహ్నం గాజర్ల కుటుంబీకులకు తెలియజేశారు. దీంతో ప్రస్తుతం హనుమకొండలో నివాసం ఉంటున్న సమ్మయ్య, అశోక్(ఐతు)లు రవి మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు బయలుదేరి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున తిరిగి వెలిశాలకు వచ్చే అవకాశం ఉండగా.. రవి అంత్యక్రియలు సాయంత్రం జరగనున్నాయి.

సారయ్య విగ్రహం ఏర్పాటు.. కూల్చివేత.. పోలీసుల శాంతి స్తూపం

2008లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల సారయ్య హతమవగా కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థంగా ఆయన విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇప్పటికీ కూలిపోయిన సారయ్య విగ్రహం అక్కడ ఉంది. కాగా, గాజర్ల కుటుంబంలో నక్సల్స్‌లో చేరిన ముగ్గురిని చూసి గ్రామంలో చాలామంది ఉద్యమ బాట పట్టారు. దీంతో 2005లో అప్పటి సీఐ శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వెలిశాల గ్రామంలో శాంతి స్తూపాన్ని ఏర్పాటు చేశారు.



గాజర్ల రవి (ఫైల్)



వెలిశాలలో పోలీసులు నిర్మించిన శాంతి స్తూపం

ఆపరేషన్లలో దిట్ట..

గాజర్ల రవి 1985-1986లో వరంగల్‌లో ఐటీఐ చదువుతున్న క్రమంలోనే ఉద్యమాలకు ఆకర్షితుడై స్టూడెంట్ యూనియన్‌లో పనిచేశాడు. తన అన్న సారయ్య అప్పటికే క్రియాశీలకంగా నక్సల్స్ ఉద్యమంలో పనిచేస్తుండటంతో ఆ ప్రభావం రవిపై పడింది. దీంతో 1992లో ఉద్యమంలోకి వెళ్లిపోయాడు. పోలీసులపై దాడులు చేయడంలో దిట్టగా గాజర్ల రవి పేరొందాడు. ఆయన ఆపరేషన్ నిర్వహిస్తే ఫెయిల్ కాదన్న అభిప్రాయం ఉంది.

- 1994లో ప్రస్తుత జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డలో ల్యాండ్ మైన్ పేల్చి నలుగురు పోలీసులను చంపిన వారిలో రవి కీలకంగా వ్యవహరించాడు.
- 2001లో ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌పై దాడి ఘటనలో ఉన్నాడు. ఇవే కాక పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలపై జరిపిన అనేక దాడుల్లో రవి కీలకంగా వ్యవహరించాడు.
- 2004లో మావోలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో రవి కూడా ప్రతినిధిగా వ్యవహరించాడు.

మూగబోయిన వెలిశాల..

ఎన్‌కౌంటర్‌లో రవి మృతి చెందిన విషయం తెలిసి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నక్సల్స్ ఉద్యమానికి పురుడు పోసిన గాజర్ల కుటుంబంలో ఇద్దరు ఉద్యమకారులు నేలకొరిగారంటూ గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు రవితో గడిపిన సమయాలను నెమరు వేసుకుంటున్నారు.

ఉప్పల్‌లో చైన్‌స్నాచింగ్

- వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల పుస్తెలతాడు అపహరణ
- ఘటనా స్థలిని పరిశీలించిన డీసీపీ, పోలీసు ఉన్నతాధికారులు

కమలాపూర్: ఇల్లు కిరాయికి కావాలంటూ వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలో నుంచి నాలుగు తులాల పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు లాక్కెళ్లిన ఘటన ఉప్పల్‌లో మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన సముద్రాల మల్లమ్మ (70) తన భర్తతో కలిసి స్థానిక బస్టాండ్ సమీపంలో నివసిస్తోంది. నాలుగు రోజుల నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి మల్లమ్మ ఇంటి చుట్టూ తిరుగుతూ ఇల్లు కిరాయికి కావాలని అడిగి, రూ.500 అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఆ తర్వాత ఈ నెల 17న రాత్రి సుమారు 9 గంటలకు వచ్చి ఇంటి సామాన్లు వస్తున్నాయంటూ నమ్మించాడు. రాత్రి 12 గంటలకు మల్లమ్మను మంచినీళ్లు కావాలని అడిగాడు. మంచినీళ్లు తెచ్చి ఇస్తున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, అడిషనల్ క్రైం డీసీపీ బోనాల కిషన్, ఏసీపీ సదయ్య తదితరులు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణతో కలిసి బుధవారం వేర్వేరుగా సందర్శించారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు.



బాధితురాలితో మాట్లాడుతున్న డీసీపీ షేక్ సలీమా

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

వీ-హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఔత్సాహిక మహిళా పారిశ్రామివేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వీ-హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఎస్‌హెచ్‌జీలు, మహిళా పారిశ్రామివేత్తలకు 'ఎంఎస్‌ఎంఈ ర్యాంప్ ఉమెన్ యాక్సెలరేషన్ పథకం'పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంపికైన మహిళా పారిశ్రామివేత్తలు తమ వ్యాపారాలను అభివృద్ధిని చేసుకొని ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందని సూచించారు. ఇందులో భాగంగా టెక్స్‌టైల్, ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్, హస్తకళల రంగాల్లోని వ్యాపారులకు వ్యాపార నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సరఫరా, బ్రాండింగ్, మార్కెటింగ్ యాక్సెస్, క్రెడిట్ లింకేజీ మద్దతు అందుతుందని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు చెందిన ఔత్సాహిక మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సదస్సులో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఇండస్ట్రీస్ జీఎం నవీన్‌కుమార్, వీ-హబ్ టీంసభ్యులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఊహ సజ్జ

దత్తత దందాపై టాస్క్'ఫోర్స్'

నకిలీ సర్టిఫికెట్ల గుట్టురట్టు చేసే దిశగా పోలీసుల విచారణ

- ఇప్పటికే ఎనిమిది నకిలీవని నిర్ధారించిన విద్యాశాఖ
- బాలరక్షా భవన్ సిబ్బందిని విచారించిన పోలీసులు

సాక్షి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'సాక్షి'లో ప్రచురితమైన 'దత్తతలో నకిలీ సర్టిఫికెట్ల దందా'పై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దృష్టి సారించారు. తక్కువ వయసున్న పిల్లలను పొందడానికి ఎక్కువ వయసున్న దంపతులను తక్కువ వయసుగా చూపించేందుకు వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎనిమిది మంది పొందిన డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు నకిలీవని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ధారించడంతో ఈ రాకెట్ వెనుక ఎవరున్నారనే వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకునే దిశగా విచారణ ముమ్మరం చేశారు. ఈ మేరకు హనుమకొండ బాలసముద్రంలోని బాలరక్షాభవన్‌లో బాలల సంరక్షణ విభాగాధికారులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారించి, దత్తతకు సమర్పించిన పత్రాలు సేకరించినట్లుగా తెలిసింది. సెలవులో ఉన్న జిల్లా సంక్షేమ విభాగాధికారి రాగానే గురువారం ఆమె సమక్షంలోనే పోలీసుల విచారణ చేయనున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ విభాగాధికారి, బాలల సంరక్షణ విభాగాధికారి సమక్షంలో వరంగల్ కలెక్టరేట్‌లో నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన దత్తత కోరే జంటలతోపాటు ఆయా నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చారని భావించిన పాఠశాల నిర్వాహకులను పిలిచి విచారించారు. అయితే చాలా మంది పాఠశాలల నిర్వాహకులు ఆ సర్టిఫికెట్లు తామివ్వలేదని చెప్పారు. దీంతోపాటు గతంలోనే సదరు సర్టిఫికెట్లు సృష్టించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. తొలుత సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కోరారు. అలాగే దత్తతకు దరఖాస్తు చేసుకున్న ఓ జంట అసలు తాము చదవుకున్నా కూడా, ఓ అధికారి తమ వద్ద డబ్బులు తీసుకొని సదరు పత్రాలు తెప్పించారని, తక్కువ వయసున్న పిల్లలు వచ్చేలా చూస్తామని చెప్పారని డీఆర్వో ఎదుట అంగీకరించడంతో నకిలీ సర్టిఫికెట్ల గుట్టురట్టైనట్లుగా తెలిసింది. ఈ సమగ్ర విచారణ నివేదికను కలెక్టర్ సత్యశారదకు డీఆర్వో పంపనున్నారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. మరో ఆరుగురు పిల్లల దత్తతను కోరేవారిని కూడా విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం.

మూడేళ్ల డేటాపై కసరత్తు..

తాజాగా ఎనిమిది మంది నకిలీ బర్త్‌డే సర్టిఫికెట్లు సమర్పించారని విద్యాశాఖ ధ్రువీకరించడంతో ఇలాంటివి ఇంకా ఎన్ని ఉన్నాయనే దిశగా జిల్లా సంక్షేమ విభాగాధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో గత మూడేళ్లకు సంబంధించిన దత్తత రికార్డులు పూర్తిస్థాయిలో పరిశీలించడం , పాఠశాలల నుంచి నకిలీ బర్త్ సర్టిఫికెట్లు జారీ తదితరాలపై పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారు. దత్తత అనుబంధ విభాగమైన శిశు గృహంలోని సిబ్బంది సదరు పత్రాలు ఈ దత్తత దందాను విచారిస్తున్న డీఆర్వోకు అప్పగించనున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇందులో కూడా భారీగా అదే పాఠశాలల నుంచి నకిలీ బర్త్ సర్టిఫికెట్లు వస్తే ఈ కేసు మరింత కీలకంగా మారనుంది. ఇప్పటికే ఎనిమిది నకిలీ సర్టిఫికెట్ల సృష్టించినవారిపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. మిగిలిన జిల్లాలోనూ ఈ ఘటనలున్నాయా.. అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రూ.25 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.3.50 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, రూ.27 లక్షల కుడా నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్, రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎంపీ కడియం కావ్యతో కలిసి బుధవారం ముప్పారం కేజీబీవీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని, బిల్లుల మంజూరులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులకు కచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ సర్కారు అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. డీఈఓ వాసంతి, డీఎంహెచ్ఓ అప్పయ్య, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరు సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



ముల్కనూరు సొసైటీ డైరెక్టర్‌తో ఎన్నికల అధికారి కోదండరాములు

ఎల్కతుర్తి: సహకార రంగంలో పేరుగాంచిన ముల్కనూరు సొసైటీ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవమయ్యాయి. ముల్కనూరు సహకార సంఘంలో ఇటీవల ఐదు డైరెక్టర్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఆరు నామినేషన్లు ఉపసంహరించుకోగా బుధవారం ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి కె.కోదండరాములు తెలిపారు. ఒకటో డైరెక్టర్ స్థానం అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రెండో డైరెక్టర్ స్థానం బొల్లంపల్లి కుమారస్వామి, ఐదో డైరెక్టర్ స్థానం గనవేన శ్రీనివాస్, తొమ్మిదో డైరెక్టర్ స్థానం గుర్రాల భాస్కర్‌రెడ్డి, 15వ డైరెక్టర్ స్థానంలో కాసిరెడ్డి వసంత ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, బ్యాంకు అధ్యక్షుడు ఈనెల 30న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ విజయకేతనంతో సంబురాలు చేసుకున్నారు.

క్లుప్తంగా

ఈతకెళ్లి రైల్వే ఉద్యోగి మృతి

● మున్నేరువాగులో ఘటన


సందీప్ మృతదేహం

డోర్నకల్: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకెళ్లిన ఓ రైల్వే ఉద్యోగి ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎర్రంశెట్టి సందీప్(28) డోర్నకల్‌లో రైల్వే ట్రైన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం మిత్రులతో కలిసి సరదాగా మున్నేరువాగులో ఈతకు వెళ్లాడు. అక్కడ మిత్రులు ఈత కొడుతుండగా ఈతరాని సందీప్ వాగు ఒడ్డున నీటిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు వాగులోకి జారి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారుల సాయంతో వాగు నుంచి సందీప్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడికి నాలుగు నెలల క్రితం వివాహం జరిగినట్లు సమాచారం.

చికిత్స పొందుతున్న ఆర్మీ జవాన్ మృతి


ప్రవీణ్(ఫైల్)

శాయంపేట : భార్య వేధింపులతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ ఆర్మీ జవాన్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్(28) సికింద్రాబాద్ తిరుమలగిరిలోని టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్ 125లో విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య కొంత కాలంగా తనను వేధింపులకు గురిచేయడంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేసింది. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్.. ఈ నెల 8న హనుమకొండలో గడ్డి మందు తాగాడు. వెంటనే హైదరాబాద్‌లోని మిలటరీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రత్యేక హెలికాప్టర్‌లో పూణెకు తరలించగా ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, తన ఆత్మహత్యాయత్నానికి భార్య, అత్తామామలేనని కారణమని ప్రవీణ్ అంతకుముందు ఓ వీడియోలో వెల్లడించారు.

నేటి నుంచి రెండు స్పెషల్ రైళ్లు..

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా గురువారం నుంచి యశ్వంత్‌పూర్-యోగ్‌నాగరి రిషికేష్-యశ్వంత్‌పూర్ మధ్య రెండు స్పెషల్ రైళ్లు నడుస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన యశ్వంత్‌పూర్-యోగ్ నాగరి రిషికేష్ (06597) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 21వ తేదీన యోగ్‌నాగరి రిషికేష్-యశ్వంత్‌పూర్ (06598) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్లనున్నట్లు తెలిపారు. ఫస్ట్ క్లాస్, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ స్లీపర్, జనరల్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రెండు రైళ్ల సర్వీస్‌లకు యెలహంక జంక్షన్, హిందుపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్‌సిటీ, కాచిగూడ, కాజీపేట, బల్లార్షా, నాగ్‌పూర్, భోపాల్, బీనాజంక్షన్, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, మతుర, హజ్రత్‌నిజాముద్దీన్, గజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, టాప్రి జంక్షన్, రూర్కి, హరిద్వార్‌లో హాల్టింగ్ కల్పించినట్లు ఆయన తెలిపారు.

చదువుకొనే వేళ..



వరంగల్‌లోని షాపుల్లో పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

● చుక్కల్లో బ్యాగులు, యూనిఫాం ధరలు
● నోట్ పుస్తకాలు రేట్లు పైపైకి..
● పెరిగిన ధరలతో తల్లిదండ్రులు ఆందోళన

ఖిలా వరంగల్: వేసవి సెలవులు ముగిశాయి. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆటాపాటలకు టాటా చెప్పి బడిబాట పడుతున్నారు. అయితే తమ పిల్లలు చదువు'కొన'డానికి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి కారణం స్కూల్ ఫీజులు. ఈ అంశ ఒక ఎత్తయితే వారికి కావాల్సిన విద్యాసామగ్రి కొనడం మరో ఆందోళన కలిగించే అంశం. ఈ క్రమంలో అప్పు చేసైనా తమ పిల్లలకు విద్యాసామగ్రి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వరంగల్ నగరంలోని బుక్‌స్టాళ్లు, బ్యాగుల షాపులు, 'షూ' మార్టులు కిక్కిరిస్తున్నాయి. అయితే అన్ని వస్తువుల ధరలు గతేదాది కంటే పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి ఉచితంగా సమకూర్చుతున్నా తల్లిదండ్రులు వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆర్థిక భారమైనా ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కార్పొరేట్ హంగులకు సరిపడేలా తమ పిల్లలను తయారు చేసి పంపించాల్సి వస్తోంది.

పెరిగిన 'షూ' ధర..

'షూ' ధర గత సంవత్సరంతో పోల్చుకుంటే జతకు రూ.50 వరకు పెరిగింది. ప్రస్తుతం రూ.250 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. బ్రాండెడ్ షూ అయితే రూ.700 మధ్య లభిస్తున్నాయి.

పౌచ్‌ల ప్రపంచం..

ప్రస్తుతం ప్రతీ విద్యార్థి వద్ద పౌచ్ ఉండాల్సిందే. పెన్సిళ్లు, పెన్నులు, ఎరేజర్స్, ఇతర తినుబండారాలు ఇందులో భద్రపరుచుకుంటారు. ఎల్‌కేజీ మొదలు.. డిగ్రీ విద్యార్థుల వరకు పౌచ్‌ను వినియోగిస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌లో ఈ వస్తువుకు డిమాండ్ ఉంది. రూ.40 నుంచి రూ. 200 వరకు ఉంది. పౌచ్ ధర కూడా గత సంవత్సరంతో పోల్చుకుంటే 10 శాతం వరకు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

పెన్ను మరింత ప్రియం..

గతంలో ఎల్‌కేజీ, యూకేజీ, ఫస్ట్ క్లాస్ వరకు పెన్సిల్‌తోనే రాయాల్సిండేది. ప్రస్తుతం లేదు. ఏకంగా పెన్నుతోనే రాత ప్రారంభిస్తున్నారు. ఫలితంగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 3 నుంచి రూ.100 వరకు పెన్ను అందుబాటులో ఉంది. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ధరలో వ్యత్యాసం తీవ్రంగా కనిపిస్తోంది. పెన్సిళ్ల ధర రూ.4 నుంచి రూ.7, లెడ్ పెన్సిళ్లు రూ.5 నుంచి రూ.50 వరకు ఉంది.

స్కూల్ బ్యాగు ధర పైకి..

స్కూల్ బ్యాగు రూ.250 నుంచి రూ.వెయ్యి మధ్య లభిస్తోంది. గతేదాదితో పోలిస్తే ధర పెరిగింది. బ్రాండెడ్ స్కూల్ బ్యాగు ధర మరింత ప్రియం అయ్యింది. రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు ఉంది.

అమాంతం పెరిగిన కుట్టుకూలి..

యూనిఫాం ధర నామమాత్రంగానే ఉంది. అయితే కుట్టు కూలి మాత్రం అమాంతం పెంచారు. జత కుట్టడానికి కూలి రూ.250 నుంచి రూ.500 తీసుకుంటున్నారు. అధిక శాతం ప్రైవేట్ స్కూళ్లు నేరుగానే విద్యార్థులకు రెడీమేడ్ ఇస్తున్నారు.

జామెట్రీ బాక్స్..

విద్యార్థులు ఎక్కువ కొనుగోలు చేసే వస్తువుల్లో జామెట్రీ బాక్స్ ఎక్కువ ఉంటుంది. దీనిని 4వ తరగతి నుంచే వినియోగిస్తున్నారు. ధర రూ.40 నుంచి రూ.250 వరకు అమ్ముతున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 5శాతం ధరలు పెరిగినట్లు వ్యాపారులే చెబుతున్నారు.

నోటు బుక్స్ కొనలేకపోతున్నాం..



గతేదాది పోల్చుకుంటే నోటుబుక్స్, పెన్నులు ,పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్, పౌచ్, టెస్ట్ బుక్స్, షూ, స్కూల్ బ్యాగులు ధరలు పెరిగాయి. ఇద్దరు పిల్లలకు నోటుబుక్స్, పెన్నులు, ఇతర మెటీరియల్‌కు రూ.6వేల పైగా ఖర్చు చేశాం. పూర్తి స్థాయిలో నోటు బుక్స్, ఇతర వస్తువులు కొనలేకపోతున్నాం.

రంజిత్, కాశిబుగ్గ వరంగల్

కుట్టుకూలి ధరలు పెరిగాయి..



యూనిఫాం వినియోగం తగ్గింది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు తమకు విద్యార్థులకు నేరుగా ఇచ్చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా యూనిఫాం ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మా వద్ద కొనుగోలు చేసే వారు కరువయ్యారు. బట్ట ధర తక్కువ ఉంది. కుట్టు కూలి ధరలు మాత్రం పెరిగాయి. ఒక్కో జతకు రూ.250 నుంచి రూ. 400 వరకు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ ఎదుర్కొలేదు.

రాధాకృష్ణ, వస్త్ర వ్యాపారి వరంగల్

డిస్క్‌ల మార్పుపై మల్లగుల్లాలు..

డిపార్ట్‌మెంట్ ఖర్చుతో చేయాలా? కాంట్రాక్టర్‌తో చేయించాలా?

● అమ్మవారిపేట 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ విద్యుత్ సబ్ సబ్ స్టేషన్లకు లైన్..
● నాణ్యతలేని డిస్క్‌లతో తరచూ విద్యుత్ అంతరాయం
● కాంట్రాక్టర్‌తో మార్పించాలని సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశం
● తానేందుకు మార్చుతానంటున్న కాంట్రాక్టర్
● అయోమయస్థితిలో అధికారులు


కేవీ లైన్‌లో డిస్క్‌లు మారుస్తున్న ఉద్యోగులు

హన్మకొండ : అమ్మవారిపేట 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి హనుమకొండ, వరంగల్‌లోని రెండు సబ్ స్టేషన్లకు వేసిన విద్యుత్ లైన్‌లో తలెత్తిన సమస్య పరిష్కారానికి టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ సర్కిల్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నాణ్యత లేని డిస్క్‌ల సమస్య అధికారులకు తలనొప్పిగా మారింది. తరచూ డిస్క్‌లు పగిలి షార్ట్ సర్క్యూట్ అవుతూ విద్యుత్ అంతరాయం కలుగుతుండడంతో దిద్దుబాటు ఎలా అనే ఆలోచనలో పడ్డారు. అంతరాయాలను నివారించడానికి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని అమ్మవారిపేట 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి హనుమకొండ న్యూశాయంపేట, వరంగల్ ఉర్సు వరకు 33 కేవీ విద్యుత్ లైన్ వేశారు. ఈ లైన్‌లో తరచూ విద్యుత్ అంతరాయాలు కలుగుతుండడంతో స్థానిక అధికారులు సీఎండీ ఆగ్రహానికి గురి కావాల్సి వస్తోంది. దీంతో క్షేత్ర స్థాయి అధికారులు, ఉద్యోగులు అంతరాయం కలిగిన ప్రతీసారి నరకయాతన పడుతున్నారు.

సమస్య గుర్తించడంలో తీవ్ర ఇబ్బందులు

ఎక్కడ సమస్య ఉత్పన్నమైందో గుర్తించడం ఉద్యోగులకు కష్టతరంగా మారింది. టవర్ ఎక్కి పరిశీలిస్తేనే ఈ సమస్య గుర్తిస్తామని, ఇలా ప్రతీ టవర్ ఎక్కి దిగడం ద్వారా అవస్థలు పడుతున్నామని, కాంట్రాక్టర్ చేసిన నాణ్యతలేని పనికి తాము బలవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ 33 కేవీ లైన్‌లో తరచూ విద్యుత్ అంతరాయం కలుగడంపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఏప్రిల్ జరిగిన సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎందుకు అంతరాయాలు జరుగుతున్నాయని అధికారులను అడిగితెలుసుకున్నారు. డిస్క్‌లు తరచూ పగిలిపోతున్నాయని, దీంతో షార్ట్ సర్క్యూట్ అయి బ్రేక్‌డౌన్ అవుతుందని సీఎండీకి వివరించారు. దీంతో ఈ విద్యుత్ లైన్ నిర్మించిన కాంట్రాక్టర్ ద్వారా డిస్క్‌లన్నీ మార్పించాలని అధికారులను ఆదేశించారు.

కాంట్రాక్టర్ నుంచి లభించని సంపూర్ణ మద్దతు..

అయితే కాంట్రాక్టర్ నుంచి అధికారులకు సంపూర్ణ మద్దతు లభించడం లేదని విద్యుత్ ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తాను విద్యుత్ లైన్ వేసినప్పుడే క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పాటు ఇతర అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తనకు బిల్లులు చెల్లించారని, అప్పుడు నాణ్యత ఉన్నవి, ఇప్పుడు నాణ్యత లేకుండా ఎలా పోతాయని, పైగా తనకుండే 18 నెలల మెయింటెనెన్స్ సమయం కూడా గడిచి పోయింది... తాను ఎందుకు డిస్క్‌లు మారుస్తానని కాంట్రాక్టర్ ఎదురు ప్రశ్నించారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, 15 నుంచి 20 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్ల డిస్క్‌లు, ఇన్సులేటర్లు ఇప్పటి వరకు చెక్కు చెదరకుండా, పగలకుండా ఉండగా మూడు, నాలుగేళ్ల క్రితం వేసిన అమ్మవారిపేట-న్యూశాయంపేట, అమ్మవారిపేట- ఉర్సు 33 కేవీ విద్యుత్ లైన్‌లో ఎందుకు సమస్య ఉత్పన్నమవుతుందనే చర్చ సాగుతోంది. నాణ్యత లేని డిస్క్‌లు, ఇన్సులేటర్లు వాడడం వల్లే అవి పగిలిపోయి ఈ పరిస్థితులు కలుగుతున్నాయని ఉద్యోగులు తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌పై రూ.4 లక్షల వరకు భారం..

33 కేవీ విద్యుత్ లైన్ వేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి పెంచడంతో తాను డిస్క్‌లు వేయనని, అవసరమైతే లేబర్ సాయం మాత్రం చేస్తానని చెప్పినట్లు సమాచారం. అయితే డిస్క్‌ల ఎవరు తీసుకురావాలి..? ఎక్కడి నుంచి తీసుకురావాలి..? అనే మీమాంసలో అధికారులు పడ్డారు. కాంట్రాక్టర్ నుంచి సహాయ నిరాకరణ ఎదురుకాగా ఈ సమస్య పరిష్కారం అధికారులకు భారం మారుతోంది. చివరకు ఎన్పీడీసీఎల్ అధికారులు డిస్క్‌లు వేసే బాధ్యత తీసుకుని కాంట్రాక్టర్ ద్వారా లేబర్ సాయం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. డిస్క్, దానిని బిగించడానికి వాడే మెటీరియల్ కలుపుకుని ఒక్కో డిస్క్‌కు రూ.615 ఖర్చవుతుంది. ఈ లెక్కన 33 కేవీ విద్యుత్ లైన్‌లో దాదాపు 600కు పైగా డిస్క్‌లు మార్చాల్సిన అవసరముంది. 600 డిస్క్‌లు మార్చడానికి వాటి ఖరీదు రూ.3.69 లక్షలు అవుతుంది. ఇతర ఖర్చులు కలుపుకుంటే దాదాపు రూ.4 లక్షల వరకు టీజీ ఎన్పీడీసీఎల్‌పై భారం పడనుంది. ఈ భారం భరించడంపై అధికారులు ఎటూ తేల్చుకోలేక పోతున్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్‌తో చేయించాలా... డిపార్ట్‌మెంట్ ద్వారా చేయాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

సైనిక వెల్ఫేర్ ఫండ్‌కు కేయూ అధ్యాపకుల చేయూత


● వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం సమక్షంలో ఒక రోజు బేసిక్ పే అందజేత



వీసీ, రిజిస్ట్రార్ సమక్షంలో రమేశ్‌కుమార్‌కు చెక్ అందజేస్తున్న అకుట్ బాధ్యులు

కేయూ క్యాంపస్: సైనిక వెల్ఫేర్‌కు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే ఫండ్‌గా కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ అధ్యాపకుల తమ ఒక రోజు బేసిక్ పే రూ. 3లక్షల 7వేల 610(చెక్) బుధవారం తెలంగాణ రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేశ్ కుమార్‌కు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) అధ్యక్షుడు బి. వెంకట్రామ్‌రెడ్డి అందజేశారు. బుధవారం క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ వి. రామచంద్రం సమక్షంలో చెక్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రతలో సైనికులు సేవలు చిరస్మరణీయన్నారు. తెలంగాణ రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేకరించిన సైనిక వెల్ఫేర్ ఫండ్‌ను సైనికుల సంక్షేమం కోసం ఖర్చుచేస్తున్నామన్నారు. ఈ విషయంలో పారదర్శకత, జవాబుదారితనం ఉంటుందన్నారు.కార్యక్రమంలో అకుట్ జనరల్ సెక్రటరీ ఎల్‌పి. రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం హుండీల కానుకల లెక్కింపు


హుండీల కానుకలు లెక్కిస్తున్న వలంటీర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ హుండీల కానుకలను బుధవారం మేడారంలోని డార్మెటరీ భవనంలో దేవాదాయశాఖ అధికారులు, పూజారుల సమక్షంలో కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీవల్లి సేవ సంస్థ ఆధ్వర్యంలో వలంటీర్లు లెక్కించారు. మేడారం ఈఓ వీరస్వామి పర్యవేక్షణలో హుండీల కానుకలను లెక్కించారు. సమ్మక్క హుండీ ఆదాయం రూ. 18,36,233, సారలమ్మ ఆదాయం రూ. 16, 59,383, పగిడిద్దరాజు ఆదాయం రూ. 72, 289, గోవిందరాజు ఆదాయం రూ, 81,463.. మొత్తం హుండీల ఆదాయం రూ. 36,49,368 లక్షలు వచ్చినట్లు ఈఓ వీరస్వామి తెలిపారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు జగదీశ్వర్, వీరన్న, మధు, బాలకృష్ణ, పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్ ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: తనకు సీరియల్ విధానంలో లారీ కిరాయి చూపలేదనే మనస్తాపంతో ఓ లారీ యజమాని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఏనుమాముల మార్కెట్ సమీపాన 'ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్' పార్కింగ్ స్థలంలో చోటు చేసుకుంది. లారీ ఓనర్ల కథనం ప్రకారం.. వరంగల్ కొత్తవాడకు చెందిన ఏదునూరి రాజేంద్రప్రసాద్‌కు లారీ ఉంది. ఈ క్రమంలో తనకు సీరియల్ విధానంలో కిరాయి చూపాలని బుధవారం సాయంత్రం లారీ ఎక్కి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన లారీ ఓనర్లు అడ్డుకుని హుటాహుటిన ఎంజీఎం తరలించారు. ఈవిషయం తెలిసిన ఏనుమాముల పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

మంట కలిసిన మానవ సంబంధం

అన్నను దారుణంగా హత్య చేసిన తమ్ముళ్లు

● భూ వివాదమే కారణం
● మహబూబాబాద్ జిల్లాలో ఘటన


వల్లపు కృష్ణ(ఫైల్)


కొడుకు మృతదేహం చూసి విలపిస్తున్న తండ్రి లింగయ్య

కురవి: ధన దాహం.. ఆస్తి పంపకాల్లో తేడాలతో రక్త సంబంధాలు మంట కలిసిపోతున్నాయి.. భూ వివాదంలో అన్నాదమ్ముళ్ల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ హత్యకు దారితీసింది. సొంత తమ్ముళ్లు (పినతల్లి కుమారులు).. అన్నయ్య వల్లపు కృష్ణ(43)ను దారుణంగా కత్తితో పొడిచి చంపారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండల కేంద్రానికి చెందిన వల్లపు లింగయ్యకు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య మాణిక్యమ్మకు ఒక కొడుకు కృష్ణ, ముగ్గురు కుమార్తెలు ప్రమీల, రమణ, వినోద ఉన్నారు. రెండవ భార్య నర్సమ్మకు ఇద్దరు కొడుకులు నరేశ్, మహేశ్ ఉన్నారు. లింగయ్యకు గ్రామ ప్రధాన రహదారికి అనుకుని 16 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం లింగయ్య తన ముగ్గురు కొడుకులకు, కూతురు రమణకు భూమి పట్టా చేయించాడు. కొన్నేళ్ల తర్వాత భూమి పంపకాలు చేశాడు. బిడ్డకు ఎందుకు పట్టా చేశావని రెండో భార్య కొడుకులు తండ్రితో గొడవ పడుతున్నారు. పలుమార్లు పంచాయితీలు, పోలీస్ స్టేషన్‌లో కేసుల దాకా వెళ్లింది. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో భూమి పంపకాల్లో రిజిస్ట్రేషన్ సర్వేనంబర్ ప్రకారం రెండో భార్య కొడుకుల్లో ఒకరు నరేశ్‌కు రోడ్డు వైపు వచ్చింది. కాగా, తండ్రి.. ముగ్గురు కుమారులకు రోడ్డువైపు సమానంగా ఉండేలా పంపకాలు చేశాడు. కానీ, నరేశ్ రిజిస్ట్రేషన్ ప్రకారం తనకు భాగం వచ్చిందంటూ తండ్రి చేసిన పంపకాన్ని ఒప్పుకోవడం లేదు. ఈ పంచాయితీ ముదిరిపాకాన పడింది. కృష్ణ తన భార్య సత్యవతి, కుమారుడు మిన్ను, కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లో బతుకుతున్నాడు. ఈ నెల 17న (మంగళవారం) హైదరాబాద్ నుంచి సీరోలుకు వచ్చాడు. బుధవారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం తమ్ముళ్లు నరేశ్, మహేశ్, వారి భార్యలు, కాంపల్లికి చెందిన నున్న వీరన్న(నరేశ్ బావమరిది) కలిసి వ్యవసాయ భూమి వద్ద కృష్ణతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న తండ్రి లింగయ్య అక్కడికి చేరుకున్నాడు. గొడవ ముదరడం, తండ్రి గొడవను ఆపే యత్నం చేశారు. అప్పటికే వెంట తెచ్చుకున్న కత్తితో నరేశ్ తన అన్న కృష్ణ కుడి మెడపై నరికాడు. ఆపే యత్నం చేస్తున్న తండ్రికి సైతం గాయాలయ్యాయి. కృష్ణ రక్తమడుగులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలియడంతో సీరోలు ఎస్సై నగేశ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, తండ్రి లింగయ్యను చికిత్స నిమిత్తం వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్ సీరోలుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా, నిందితుడు నరేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

కొడుకు పుట్టిన రోజే తండ్రి మరణం..

మృతుడు వల్లపు కృష్ణ కొడుకు మిన్ను పుట్టిన రోజు బుధవారం. సాయంత్రం వేడుకలు చేద్దామని అనుకున్న తరుణంలో ఈ హత్య జరగడంతో ఆ కుటుంబాన్ని కుంగదీసింది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్.రాంచందర్ అన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఫెడరేషన్ వరంగల్ రీజియన్ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులపై వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ డ్యూటీల పేరుతో డ్రైవర్లు, కండక్టర్లపై వేధింపులు మానుకోవాలన్నారు. ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని, డబుల్ డ్యూటీకి డబుల్ వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం విధానాలతో ప్రయాణికులు అసౌకర్యానికి గురై సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని, ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫెడరేషన్ వరంగల్ రీజియన్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బి.బాబు రావు, ఎల్.యాదగిరి, బి.సుధారాణి, అల్వార్, ఎన్.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, కార్యదర్శిగా బి.యు.చారి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.సతీశ్, ఓ.కొమ్మాలు, పి.కె.మూర్తి, డి.సంపత్, ఎం.డి.షాబుద్దీన్, ఎస్.పుష్ప, కోశాధికారిగా బి.శంకర్, ప్రచార కార్యదర్శిగా పి.మహేందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో సీపీఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి, సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేశ్

● కాంట్రాక్టు అగ్రిమెంట్ పరిమితి పెంచేందుకు రూ.లక్ష డిమాండ్
● రూ.80వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు


ఏసీబీ అధికారులను ఆశ్రయించిన కాంట్రాక్టర్లు అజారుద్దీన్, నజీరుద్దీన్


డబ్బులతో పట్టుబడ్డ విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేశ్

మహబూబాబాద్ రూరల్ : విద్యుత్ కాంట్రాక్ట్ అగ్రిమెంట్ పరిమితి పెంపునకు కాంట్రాక్టర్లనుంచి లంచం తీసుకుంటూ ఆ శాఖ మహబూబాబాద్ ఎస్ఈ నరేశ్ బుధవారం ఏసీబీకి చిక్కారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన క్లాస్-1 కాంట్రాక్టర్లు అజారుద్దీన్, నజీరుద్దీన్ మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మరిపెడ సబ్ డివిజన్ల పరిధిలోగల సీరోలు, చిన్నగూడూరు సెక్షన్లలో విద్యుత్ పనుల కోసం టెండర్లు దాఖలు చేశారు. పనుల నిర్వహణకు రూ.20 లక్షల పరిమితి మాత్రమే ఉండగా, కాంట్రాక్ట్ అగ్రిమెంట్ రూ.40 లక్షలకు పెంచేందుకు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) జే.నరేశ్‌ను సంప్రదించారు. రెండు నెలలుగా తిరుగుతున్నప్పటికీ పనికాలేదు. ఈ క్రమంలో సదరు అధికారి నరేశ్ లక్ష రూపాయల లంచం డిమాండ్ చేయగా, ఆ ఇద్దరు కాంట్రాక్టర్లు ఈ నెల 14వ తేదీ (శనివారం) రూ.20వేలు ముట్టజెప్పారు. మిగతా రూ.80వేలు ఇచ్చి ఆ అధికారితో పని చేయించుకోవడం ఇష్టం లేక వారు ఏసీబీ అధికారులను సంప్రదించారు. పక్కా ప్లాన్ ప్రకారం బుధవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ సమీపంలో ఎస్ఈ నరేశ్ అద్దెకు ఉండే ఇంటి వద్ద కాంట్రాక్టర్లు అజారుద్దీన్, నజీరుద్దీన్‌లు ఆయనకు రూ.80వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నరేశ్‌ను అదుపులోకి తీసుకుని గురువారం ఉదయం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు ఎల్.రాజు, ఎస్.రాజు, ఎస్సైలు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎవరైనా సరే ప్రజల పనుల కోసం లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా 9154388912 నంబర్‌ను సంప్రదించాలని వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య కోరారు.

22న భద్రకాళికి బంగారు బోనం

● దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆలయ చరిత్రలో ఈసారి వేడుకలకు ఏర్పాట్లు
● వివరాలు వెల్లడించిన ఈఓ శేషుభారతి


ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు తదితరులు

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి అమ్మవారికి ఈనెల 22న బంగారు బోనం సమర్పించనున్నట్లు భద్రకాళి ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు. భద్రకాళి ఆలయంలో బోనాలు నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈఓ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారని, అలాగే లాల్‌దర్వాజ కమిటీ సభ్యులు, భక్తులు భారీగా హాజరై అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. జంతు బలులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. భద్రకాళి ఆలయ చరిత్రలో కొత్తగా బోనాలు ఏమిటని విలేకరులు ప్రశ్నించగా.. ఆచార సంప్రదాయాల ప్రకారమే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటి నుంచి ప్రతీ సంవత్సరం బోనాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులను పరిచయం చేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బోనాలు ..

ఉమ్మడి జిల్లాలో ఆషాఢం, శ్రావణమాసాల్లో బీరన్న, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తదితర గ్రామ దేవతలకు మాత్రమే బోనాలు సమర్పించే ఆనవాయితీ ఉంది. గ్రామదేవతలకు కల్లుశాక, జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. శైవ, వైష్ణవ, స్మార్త పద్ధతిలో దేవాలయాల్లో జరిగే వాటికి శాస్త్రాధారం ఉంటుంది. ఈ మేరకు వైదిక ఆగమానుసారం జరుగుతున్న దేవాలయంలో బోనాలు సమర్పించడం పట్ల పలువురు భక్తులు విమర్శలు చేస్తున్నారు. దీనిపై అర్చకులను వివరణ కోరగా దేవాదాయశాఖ ఆదేశంతో వైదిక సంప్రదాయం ప్రకారమే జరిగే బోనాలు నిర్వహిస్తామని తెలిపారు.